క్లుప్తంగా

గౌరీశంకరునికి రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకారంలో గౌరీ శంకరుడు

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో కొలువు దీరిన గౌరీ శంకరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల విశేష లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు జరిగాయి. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దుకాణాల ప్రారంభోత్సవం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : స్థానిక శ్రీ చౌడేశ్వరి మాత దేవాలయం ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మించిన షాపులను సోమవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 షాపుల నిర్మాణానికి సహకరించిన దాతలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు వరప్రసాద్ రావు, బ్రహ్మేశ్వరయ్య, శంకర్, సువర్ణమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్వామా సూపరింటెండెంట్‌గా జవహర్‌లాల్


పీడీ అమరనాథరెడ్డికి బొకే అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థలో సూపరింటెండెంట్‌గా జవహర్ లాల్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇటీవల వరకు జిల్లా పశుసంవర్ధకశాఖ కర్నూలు డివిజన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ... గజిటెడ్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. తొలుత ఈయనను విశాఖపట్టణంలోని పశుసంవర్ధకశాఖ శిక్షణ కేంద్రానికి బదిలీ చేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థలో సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉండటంతో...ఇక్కడ విధులు నిర్వహించేందుకు ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి అవకాశం కల్పించారు. డిప్యుటేషన్‌పై డ్వామాలో పనిచేసేందుకు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ కూడా అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందుగా డ్వామా పీడీ అమరనాథరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈయన ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖలో కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇటీవలి వరకు నాన్ గజిటెడ్ సూపరింటెండెంటుగా కొనసాగిన ఆయన ఇప్పుడు గజిటెడ్ అధికారిగా పదోన్నతి పొందారు.

రెండు మట్టి లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): పాణ్యం మండలంలోని తమ్మారాజుపల్లెలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న రెండు లారీలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. పట్టుబడిన లారీల యజమానులు మట్టిని ఎంతమేర తరలిస్తున్నారో అంచనా వేసి ఒక్కొక్క లారీకి రూ.20 వేల చొప్పున రూ.40 వేలు అపరాధ రుసుం విధించినట్లు సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఎవరైనా లైసెన్స్, అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత వైద్యశిబిరం పేదలకు వరం


శిబిరంలో రోగులకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ఉచిత వైద్యశిబిరాలు పేదలకు వరమని 11వ వార్డు కార్పొరేటర్ ఫారజ్‌ఖాన్ అన్నారు. స్థానిక 11వ వార్డులోని ఖడక్‌పుర మైదానంలో సోమవారం కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇలాంటి వైద్యశిబిరాలు మరిన్ని ఏర్పాటు చేస్తే పేదలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ఫైసల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేస్తే జైలుకెళ్లాల్సిందే

- చంద్రబాబు నిజాయితీ పరుడైతే నిరూపించుకోవాలి
- జనసేన, కమ్యూనిస్టులు ఆయనకు వంత పాడటం సిగ్గుచేటు
- టీడీపీ బంద్ పిలుపును ప్రజలు పట్టించుకోలేదు
- వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు,నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని
- సానుభూతి రాజకీయాలకు కాలం చెల్లింది
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్) : స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌లో అవినీతికి పాల్పడినందుకే చంద్రబాబు జైలుకు వెళ్లారని వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. తప్పు చేస్తే ఎంతటి వారైనా శిక్ష అనుభవించక తప్పదన్నారు. దీనిపై రాద్ధాంతం చేయడం, బంద్‌కు పిలుపు నివ్వడం సిగ్గుచేటన్నారు. సోమవారం నగరంలోని పాతబస్టాండ్ వద్ద పెట్రోల్ బంకు ప్రారంభ కార్యక్రమం అనంతరం పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసానిరాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు వందకు వంద శాతం తప్పు చేశారని, అన్ని అధారాలతో సీఐడీ అరెస్టు చేసిందన్నారు. ఇందులో ఎలాంటి కక్ష సాధింపు లేదని చెప్పారు. బాబు రిమాండ్‌కు ముందు ప్రభుత్వంపై విమర్శలు చేసిన జనసేన, బీజేపీ, కమ్యూనిస్టులు ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన బాబును ఆయా పార్టీల నాయకులు వెనకేసుకు రావడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తెలుగుదేశం పార్టీ నాయకుల కంటే ఎక్కువ ఓవరాక్షన్ చేస్తున్నారని విమర్శించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదన్నారు. స్టేలతో తప్పించుకోవచ్చు అనుకున్న చంద్రబాబుకు దేవుడే శిక్ష వేశారన్నారు. 1990 సంవత్సరం నుంచి తెలుగుదేశం పార్టీకి కమ్యూనిస్టులు మద్దతు ఇస్తున్నారని, జైలుకు వెళ్లేంతవరకు చంద్రబాబు అవినీతి కనిపించలేదా అని ప్రశ్నించారు. ఇంత కాలం కోర్టులను మేనేజ్ చేసిన చంద్రబాబుకు పాపం పండిందన్నారు. ఆలస్యంగానైనా బీజేపీ చంద్రబాబు అవినీతి తెలుసుకుని అరెస్టుపై మాట్లాడ లేదన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నాడు కాబట్టే చంద్రబాబు ఇంత వరకు అరెస్టు కాలేదన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానికి కక్ష సాధించాలన్న ఆలోచన లేదని, అలాంటి ఉద్దేశం ఉంటే అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే చంద్రబాబును జైలుకు పంపేదని చెప్పారు. అవినీతి కేసులో బాబు జైలుకు వెళ్లాడని, దీనిని టీడీపీ నాయకులు రాద్ధాంతం చేయడం సిగ్గుచేటన్నారు. వారు బంద్‌కు పిలుపు నిచ్చిన ప్రజల నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదన్నారు. సానుభూతి రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు.


పెట్రోల్ బంకు ప్రారంభ కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని, హఫీజ్‌ఖాన్

నగరపాలక పెట్రోల్ పంపు ప్రారంభం

కర్నూలు (టౌన్): ఆదాయ వనరుల పెంపుపై కర్నూలు నగర పాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించినట్లు మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలో ఇండియన్ ఆయిల్ సంస్థతో కలిసి నగర పాలక సంస్థ నూతనంగా పెట్రోల్ బంకును ఏర్పాటు చేసింది. దీనిని ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డితో కలిసి మేయర్ ప్రారంభించి మాట్లాడారు. నగరపాలక సంస్థకు చెందిన ప్రతిపైసా వృథా చేయకుండా నగరాభివృద్ధికి వెచ్చిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా పెట్రోల్ పంపు ఏర్పాటును కర్నూలు కార్పొరేషన్ చేపట్టిందన్నారు. త్వరలోనే మరో పెట్రోల్ పంపు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో నగరాలు, పట్టణాలు అభివృద్ధికి దూరంగా ఉండేవన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేషన్‌ను అందంగా తీర్చిదిద్దామన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ 20 వేల లీటర్ల సామర్థ్యంతో నిరంతరాయంగా పంపు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నగర అధ్యక్షురాలు సీత్రా సత్యనారాయణమ్మ, మహిళా విభాగం ఇనచార్జ్ గాజుల శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు షాషావలీ, ఆర్షియా ఫర్హీన్, జుబేర్, క్రైప పద్మాలత, నారాయణ రెడ్డి, శ్రీనివాసరావు, కోఆప్షన్ మెంబరు క్రిష్ణమూర్తి, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు, మున్సిపల్ ఇంజినీర్లు శేషసాయి, షాకీర్ హుస్సేన్, డీఈఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం, ధర్మం గెలిచింది

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ చేయడంతో న్యాయం, ధర్మం గెలిచిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రూ.కోటియాభై లక్షలు ఖర్చు చేసి ఢిల్లీ నుంచి స్పెషల్ ఫ్లైట్‌లో న్యాయవాదిని రప్పించి, కేసు వాదించినా ఏమీ చేయలేకపోయారన్నారు. అవినీతిపరుడు చంద్రబాబుకు దత్త పుత్రుడు పవన్ కల్యాణ్, సీపీఎం, సీపీఐ, ఎంఆర్‌పీఎస్ మందకృష్ణ మాదిగ మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగితే పోరాడే కమ్యూనిస్టులు చంద్రబాబుకు సంఘీభావం తెలపడం సిగ్గుచేటని విమర్శించారు. పల్లెల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారంటే అది కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన ద్వారానే అని స్పష్టం చేశారు. కోడుమూరు నియోజకవర్గంలో అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధమని, దళిత ఎమ్మెల్యేగా తాను సవాల్ చేస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రిపై మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని చెప్పారు. చంద్రబాబుపై 40 కేసులు ఉండగా అందులో 20కు పైగా కేసుల్లో స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. సమావేశంలో జెడ్పీటీసీ గిరిజోన్, సచివాలయ కన్వీనర్లు ప్రసాద్, శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగన్న, ఆదాం, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జయప్రకాష్‌రెడ్డికి బంగారు పతకం


బంగారు పతకం అందుకుంటున్న జయప్రకాష్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ బి. జయప్రకాష్‌రెడ్డికి బంగారు పతకం లభించింది. ఈ నెల 8 నుంచి 10వ తేది వరకు నెల్లూరు పట్టణంలో జరిగిన 41వ ఈఎన్‌టీ వైద్యుల సదస్సులో తనకు బంగారు పతకం, ప్రథమ పురస్కారం లభించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం స్థానిక ఎస్ ఆర్ పేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. చాలా అరుదుగా పెద్దవారిలో గుండు సూదులు, ఎముకలు, వక్కపొడి లాంటివి ఊపిరితిత్తుల్లో ఇరుక్కుంటాయని, దీనివల్ల ఊపిరి ఆడక రోగులు ఇబ్బంది పడతారన్నారు. ఇలాంటి రోగులపై అత్యాధునిక పరికరాలను ఉపయోగించి చేసిన 20కి పైగా శస్త్రచికిత్సలను తాను ప్రదర్శించినందుకు తనకు డాక్టర్ బి. శ్రీనివాసరావు ఉత్తమ పురస్కారం, బంగారు పతకం లభించినట్లు ఆయన వివరించారు. ఇదే సదస్సులో చెవి భాగానికి టీబీ సోకిన రోగులపై చేసిన 20కి పైగా శస్త్రచికిత్సల ప్రదర్శనకు డాక్టర్ శివరామకృష్ణ ద్వితీయ పురస్కారం లభించిందన్నారు. వీటిని తనకు డాక్టర్ అప్పారావు చేతుల మీదుగా ప్రదానం చేశారన్నారు.

భక్తిశ్రద్ధలతో నందికోలు ఉత్సవం

కల్లూరు : స్థానిక శ్రీ ఈశ్వర వీరభద్ర స్వామి, శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసంలో ఆఖరి (కడ) సోమవారం సందర్భంగా ప్రజలందరూ పాడి పంటలతో ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని నందికోలు ఉత్సవం నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, మహా నైవేద్యం నివేదన, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు వీరశైవ లింగాయత్ సమితి వారి ఆధ్వర్యంలో సామూహిక సహపంక్తి భోజన కార్యక్రమం జరిగింది. సాయంత్రం నంది కోలు నిర్వహించారు.

7న జాతీయ సాహితీ సదస్సు


జాతీయ సదస్సు బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ, కళాశాల కరస్పాండెంట్ తదితరులు

కర్నూలు కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సయ్యద్ సలీం రచనలపై అక్టోబర్ 7వ తేదీన 'సలీం సాహిత్యం - సామాజిక చైతన్యం ' అనే అంశంపై జాతీయ సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉస్మానియా కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ అజ్రా జావెద్ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను అజ్రా జావెద్, ఉన్నత విద్యా శాఖ కడప ఆర్‌జేడీ డి. నాగలింగారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, ఉస్మానియా కళాశాల పూర్వ విద్యార్థి సిల్వర్ జూబ్లీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.రమణయ్య, బాలశివ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అల్తాఫ్ అహ్మద్, కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ మండి అన్వర్ హుసేన్, అధ్యాపకురాలు సునీత ఆవిష్కరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సయ్యద్ సలీం రచనలపై పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నామన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు ఈ సదస్సు కోసమే రాసిన పరిశోధన పత్రాలను సమర్పించాలని సూచించారు. సదస్సు కన్వీనర్‌గా డాక్టర్ మండి అన్వర్ హుసేన్ వ్యవహరిస్తారన్నారు.

పిల్లలందరికీ టీకాలు వేయించాలి


చిన్నారులకు టీకా వేస్తున్న నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు(హాస్పిటల్): అర్హులైన చిన్నపిల్లలందరికీ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు వేయించాలని నగర మేయర్ బీవై. రామయ్య చెప్పారు. సోమవారం స్థానిక సి.క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండో విడత ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని మేయర్ బీవై రామయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేది నుంచి 16వ తేది వరకు చిన్నపిల్లలు, గర్భిణులు ఏదైనా కారణాల వల్ల వ్యాధినిరోధక టీకాలు వేయించుకోని వారు ఈ రెండో విడత ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు వేయించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు టీకాలు వేయించుకోని వారిని గుర్తించి డ్యూ లిస్ట్ తయారు చేసుకుని వంద శాతం టీకాలు అందేటట్లు చూడాలని, ఆ వివరాలను యూ విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ దివ్య, డెమో ప్రమీలాదేవి, హెచ్ఈఈఓ శ్రీనివాసులుశెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, డీసీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్లకు ఢిల్లీలో ఉద్యమం

- 21న జంతర్‌మంతర్ వద్ద ధర్నా
- 22న రౌండ్ టేబుల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న రామక్రిష్ణ

కర్నూలు(అర్బన్): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌పై ఈ నెల 21, 22 తేదీల్లో ఢిల్లీలో ఉద్యమ కార్యాచరణను చేపడుతున్నట్లు బీసీ విద్యార్థి, యువజన సంఘం జాతీయ కార్యదర్శి కె. రామక్రిష్ణ చెప్పారు. సోమవారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ కార్యచణలో భాగంగా ఈ నెల 21న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా, 22వ తేదీన ఓబీసీ సంఘాల నేతలతో ఆంధ్రాభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు రాజ్యసభ సభ్యులు ఆర్ క్రిష్ణయ్య, పలు బీసీ సంఘాలకు చెందిన జాతీయ స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నట్లు తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశ పెట్టాలన్నారు. అలాగే కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ జనగణనను చేపట్టాలన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు వేంపెంట రాంబాబు, వాడాల నాగరాజు, భారతీ, బలరాముడు, మోహన్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్
- స్పందనలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ


స్పందన కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్) : ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలువురు కాలనీల వాసులు వివిధ సమస్యలపై ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. వాటిని ఆయన పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. స్పందనలో సిటీ ప్లానర్ మీనాకుమారి, డీసీపీ మోహన్ కుమార్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని...

☛ మంజూరైన టిడ్కో గృహం తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఇందిరాగాంధీనగర్‌కు చెందిన అబ్దుల్ లతీఫ్ కోరారు.

☛ నీటి ట్యాంకు లీకేజీ వల్ల తాగునీరు వృథాగాపోతుందని, మరమ్మతులు చేయాలని పక్కి మసీద్ ఏరియాకు చెందిన తిమోజీ అభ్యర్థించారు.

☛ తమ కాలనీలో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని మాలగేరికి చెందిన తిమోజీ ఫిర్యాదు చేశారు.

☛ తమ కాలనీ నుంచి శ్రీరామనగర్‌కు రహదారి ఏర్పాటు చేయాలని నాలుగో తరగతి కాలనీకి చెందిన రాజన్న వినతిపత్రం అందజేశారు.

☛ తమ కాలనీల్లో మురుగు నీళ్లు రోడ్లపై పారుతున్నాయని ఎస్ఆర్ పేటకు చెందిన షేక్ అబ్దుల్లా, శ్రీక్రిష్ణ కాలనీకి చెందిన మక్బూల్ హమీద్, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీకి చెందిన మురళీమోహన్ వేర్వేరుగా విన్నవించారు.

☛ పబ్లిక్ టాయిలెట్స్ సెప్టిక్ ట్యాంకు పగిలిపోయిందని, పరిశీలించి మరమ్మతులు చేయించాలని బుధవారపేటలోని చెట్టుకింద బడి ప్రాంతానికి చెందిన రామాంజనేయులు కోరారు.

☛ తమ కాలనీలో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన మెహమూద్ బేగం వినతి పత్రం అందజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

- హరితహారం కార్యక్రమంలో ఆర్‌యూ వీసీ


యూనివర్సిటీలో మొక్క నాటుతున్న ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు

కర్నూలు (న్యూసిటీ) : విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని రాయలసీమ వర్సిటీ వీసీ ఎ. ఆనందరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో హరితహారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వర్సిటీలో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం వీసీ మాట్లాడుతూ మానవమనుగడకు మొక్కల పెంపకం చాలా అవసరమన్నారు. యూనివర్సిటీలో ఆయా డిపార్ట్‌మెంట్ భవనాల దగ్గర పండ్ల మొక్కలతోపాటు ఆయుర్వేద, అడవి జాతి మొక్కలు నాటించామని చెప్పారు. వాటిని దత్తత తీసుకుని పెంచాల్సిన బాధ్యత అధ్యాపకులు, విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు గంధం అరుణ, డాక్టర్ వెంటకరత్నం, డాక్టర్ విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్, రఘు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

రేపు జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 13 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి నెట్‌బాల్ సీనియర్ మహిళల జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నెట్‌బాల్ కార్యదర్శి కె. వంశీక్రిష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.30 చెల్లించి పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14 వ తేదీ కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9160777876 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కోడుమూరు రూరల్: పట్టణానికి చెందిన విద్యార్థి సంజయ్‌రామ్ హర్యానాలోని ఎండీయూ యూనివర్సిటీలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు జరిగిన నేషనల్ సబ్ జూనియర్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో అండర్-13, 30కిలోల విభాగం రెస్లింగ్ (కుస్తీ) పోటీల్లో రాణించి కాంస్య పతకాన్ని సాధించాడు. కోడుమూరుకు చెందిన సాయినాక్షిత్ అండర్-11, సంజయ్‌రామ్, ఎండీ వాసిక్‌లు అండర్-13 విభాగంలో ఏపీ తరపున ఆడగా, సంజయ్‌రామ్ రాణించి కాంస్య పతకాన్ని సాధించారు. సంజయ్‌రామ్ ప్రస్తుతం స్థానిక శ్రీనివాస హైస్కూల్‌లో 7వ తరగతి అభ్యసిస్తున్నాడు.

ఓర్వకల్లులో క్రీడాపోటీలు

ఓర్వకల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్లు హెచ్‌ఎం రామచంద్రారెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగానికి చెందిన బాలబాలికలకు ఈ నెల 12న వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో, 14వ తేదీన కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, టెన్నికాయిట్ పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9441508711 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

సంక్షిప్తం

కోలా ప్రతాప్‌కు డాక్టరేట్

కర్నూలు (టౌన్): కరాటే క్రీడాంశంలో అందించిన సేవలకు గుర్తింపుగా కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోలా ప్రతాప్‌కు కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. ఈనెల 9 వ తేదీ గోవాలోని అర్బుడ్ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోవా మాజీ సీఎం డిగంబర్, హర్యానా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్.సి.కుమోద్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్లు ప్రతాప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలివ్వాలి

కర్నూలు(సెంట్రల్): నగరపాలకలో పనిచేసే చెత్త సేకరణ క్లాప్ ఆటోడ్రైవర్లకు పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి మారెళ్ల రామాంజనేయులు, క్లాప్ డ్రైవర్ల యూనియన్ కార్యదర్శి ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. సోమవారం వారు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

సీసీరోడ్లు, కాలువలు నిర్మించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని జొహరాపురం, బీడీ వర్కర్స్ కాలనీలో సీసీరోడ్లు, కాలువలను నిర్మించాలని అవాజ్ కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం అవాజ్ కమిటీ నాయకులు పి.ఇక్బాల్ హుస్సేన్, షేక్ మహ్మద్ షరీఫ్ మేయర్ బీవై రామయ్యను కలసి విన్నవించారు. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన సీసీరోడ్లు, కాలువలు పాడవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

పీజీ పరీక్షలకు 35 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆరు కేంద్రాల్లో 546 మంది గాను 511 మంది విద్యార్థులు పరీక్ష రాశారని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఏసీపీకి అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగర పాలక పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న రంగస్వామికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మరొక అసిస్టెంట్ సిటీ ప్లానర్ హాయత్ మొహీద్దీన్ అనారోగ్య కారణాలతో ఈనెల 21 వ తేదీ వరకు మెడికల్ లీవ్ పెట్టారు. దీంతో పాలన పరంగా ఇబ్బందులు రాకుండా రంస్వామికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం కమిషనర్ భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈరోజు

ఎమ్మిగనూరులో జాబ్ మేళా

కర్నూలు సిటీ: ఎమ్మిగనూరులోని రావూస్ డిగ్రీ కాలేజీలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగ శివలీల, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ శ్రీకాంత్ సంయుక్తంగా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం నిర్వహించే ఈ మేళాకు పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 8885904099, 9985496587, 9014588552 నంబర్లను సంప్రదించాలన్నారు.

నగరంలో విద్యుత్ కోత

కర్నూలు కల్చరల్: విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌కోత విధించనున్నట్లు ఆ శాఖ కర్నూలు డివిజన్ ఈఈ రమేష్, డీఈఈ రాజమోహన్‌రెడ్డి తెలిపారు. 33కేవీ ఫీడర్ పరిధిలోని గణేష్ నగర్, సాయి విజయ్ కాలనీ, రెవెన్యూకాలనీ, పార్థసారథి టవర్స్, శ్రీవారి కుటీర్, జొహరాపురం రోడ్, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, రామ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సెంట్రల్ సెక్షన్ పరిధిలోని బుధవార పేట, గట్టయ్య స్కూల్, కమ్మగేరి, బాలభారతి స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల జి.సింగవరంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారన్నారు.